# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## మోటర్లు వద్దు.. మీటర్లు వద్దు

"మీ10 హెచ్‌పీ మోటర్లు వద్దు.. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టుడు వద్దు.. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి.. మీటర్లు పెడితే ఎవుసం చేసుడు సాధ్యమైతదా..? అంత పెద్ద మోటర్లు, వాటికి పైపులు ఎవరు కొంటరు..? వాటికి సరిపోయే కరెంటు ఎట్లిస్తరు.? మూడు గంటల కరెంటుతోని అంత పెద్ద మోటర్లు ఒకేసారి పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా? ఎక్కడికక్కడ పేలిపోవా? మోటర్లు కాలిపోవా? ఇష్టమొచ్చినట్లు పూటకో మాట మాట్లాడితే ఎవరు నమ్ముతరు? మమ్మల్ని ముంచాలని చూస్తున్నరా?" అంటూ జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని అంటూనే 10 హెచ్‌పీ మోటర్ వాడాలని ఉచిత సలహా ఇస్తుండడంపై మండిపడుతున్నారు. అన్ని రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు పెట్టారని ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పడం.. అందులో కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాలు కూడా ఉండడంతో ఆ పార్టీ రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బయటపడిందని, ఇక్కడ కూడా మోటర్లకు మీటర్లు పెట్టే నిబంధనను ఒప్పుకుని రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నదని ధ్వజమెత్తుతున్నారు. అంతే కాకుండా ధరణిని రద్దు చేసి దశాబ్దాల కాలంగా భూ సమస్యలతో అరిగోస పెట్టిన పాత రెవెన్యూ వ్యవస్థను మళ్లీ తెస్తామంటుండడంపై కన్నెర్రజేస్తున్నారు. కాంగ్రెస్ సచ్చేది లేదు.. వచ్చేది లేదని.. ఎట్టి పరిస్థితిలో ఆ పార్టీ నాయకులను నమ్మేది లేదని స్పష్టం చేస్తున్నారు.

జగిత్యాల, నవంబర్ 23(నమస్తే తెలంగాణ)

- 10 హెచ్‌పీ సాధ్యమైతదా?
- మీటర్లు పెడితే ఎవుసం నడుస్తదా..
- ధరణి వద్దనోళ్లు మాకెందుకు..
- మమ్మల్ని ముంచాలని చూస్తున్రు
- కాంగ్రెసోళ్లను నమ్మేది లేదు
- స్పష్టం చేస్తున్న జిల్లా రైతాంగం

### ❖ మోటర్లకు మీటర్లు కూడా పెడుతరు..

నాకు భూషణరావుపేటలో పదెకరాల భూమి ఉంది. కాంగ్రెస్ దిక్కు మాలిన పాలనలో కరెంట్ లేక అష్టకష్టాలు పడ్డ. స్విచ్ ఒత్తినమో.. లేదో మోటర్లు కాలిపోతుండె. చాలా ఇబ్బందులు పడేది. కానీ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ వచ్చాక ఎవుసానికి 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తండు. ఒక్క మోటర్ కూడా కాలుతలేదు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3 గంటలే కరెంటు ఇస్తామంటున్నరట. 10 హెచ్‌పీ మోటర్లు పెడుతామని అంటున్నరట. కరెంట్‌పై కనీస అవగాహన లేకుండా నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నరు. ఇంకా వారి పాలిత రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు కూడా పెట్టిన్రట. ఇక్కడ కూడా పెడుతరు. వాళ్లదేం పోయింది. మాకు కదా ఇబ్బంది. వాళ్లను ఎవడూ నమ్ముతడు. వారి పాలనలో ఎన్నికష్టాలు పడ్డమో మాకు తెలుసు. వాళ్లు వచ్చేది లేదు. సచ్చేది లేదు.

**- పుర్కుటపు శ్రీపాల్‌రెడ్డి, రైతు భూషణరావుపేట (కథలాపూర్)**

### ❖ ఎంత గోసపెట్టిన్రో ఇంకా మరువలె..



మాది మాది కథలాపూర్. ఊళ్లే నాకు పదెకరాల భూమి ఉంది. ధరణి రాక ముందు రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండే. ఎవరికి తగ్గట్టు ఆళ్ల రాత్రికి రాత్రే రికార్డులను మార్చెటోళ్లు. సర్వే నంబర్లలో కొత్త కొత్తోళ్ల పేర్లను చేర్చి విస్తీర్ణం పెంచెటోళ్లు. పహాణీ నకళ్లలో అనుభవదారు, పట్టాదారు రెండు కాలమ్స్ ఉండేవి. రైతులు దరఖాస్తు చేస్తేనే వివరాలిచ్చేటోళ్లు. పట్వారీ వ్యవస్థతో భూ తగాదాలు ఉండెటియి. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక సీఎం కేసీఆర్ ధరణిని తెచ్చి భూములకు భద్రత కల్పించిండు. అరచేతిలోనే ధరణిలో వివరాలు చూసుకునే వెసులుబాటు కల్పించిన్రు. మా ఊరి ఆఫీసులనే నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్రు. కొనుగోలు చేసిన రైతుకు డిజిటల్ పాస్‌బుక్కు జెనరేట్ చేసి ఇస్తున్నారు. గతంలో నెలల కొద్ది ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరిగేవి. ఇది చూసి ఇతర రాష్ట్రాలోళ్లు ఇక్కడ భూములను కొంటున్రు. పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు పైసా లేనిదే పనయ్యేది కాదు. ఎవరైనా ఎక్కువ పైసలిస్తే వారి పేర్లను చేర్చి గొడవలు పెట్టించెటోళ్లు. ఇలాంటివి మస్తు చూసినం. ఈ వ్యవస్థ లేకుంటే భూ గొడవలే ఉండేవి కావని కేసీఆర్ మంచి నిర్ణయం తీసుకున్నడు. ధరణిని తెచ్చి మంచి పనిచేసిండు. కాంగ్రెసోళ్లను మేం నమ్మం. అప్పట్ల ఎంత గోసపెట్టిన్రో ఇంకా మరువలె. అందుకే ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతం. భూ సమస్యలు లేకుండా చేసిన కేసీఆర్‌కే అండగా నిలుస్తం.

**- ఇట్టేడి రాంరెడ్డి, రైతు (కథలాపూర్)**



### ❖ అన్నీ చెడగొట్టు పనులే..

మాది కథలాపూర్. నాకు ఊళ్లె పదెకరాల భూమి ఉంది. తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థతో మస్తు ఇబ్బందులు పడ్డం. పహాణీ కావాలంటే వారి చేయి తడపనిదే వివరాలు ఇచ్చే వారు కాదు. చాలా మంది రైతులు రికార్డులు కావలన్నా.. మ్యూటేషన్ కావలన్నా పనులు వదిలిపెట్టి తహసీల్ ఆఫీసు చుట్టూ తిరిగెటోళ్లు. పైరవీకారుల చేతిలో నష్టపోయేటోళ్లం. కాంగ్రెసోళ్లు ధరణి తీసేసి భూమాత తీసుకొస్తాం అంటున్రు. అట్లయితే ఎవరీ భూమి ఎక్కడ ఉంటుందో తెల్వది. రైతులను మళ్లీ బిచ్చగాళ్లను చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నది. వాళ్ల పాలనలో భూమి రిజిస్ట్రేషన్‌కు పొద్దున పోతే సాయంత్రం వచ్చేటోళ్లం. ఇప్పుడు ఎమ్మర్వో ఆఫీసులోనే 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ధరణితో అక్రమాలకు అస్కారం లేకుండా అయింది. కాంగ్రెసోళ్లను నమ్మితే రైతులు ఆగమే. ఇంతమంచి పోర్టల్‌ను తీసేస్తమని అంటున్న కాంగ్రెస్‌ను బొందపెడుతం. బంగాళాఖాతంతో కలుపుతం. ఆ పార్టీ ఇక్కడ అచ్చేది లేదు. సచ్చేది లేదు. వాళ్లవన్నీ చెడగొట్టు పనులే. ఒక్క మంచి పనీ చేయ్యరు.

**- వెల్మాల రమేశ్‌రెడ్డి, రైతు (కథలాపూర్)**

### ❖ మా తెరువస్తే.. మంచిగుండది..



రేవంత్‌రెడ్డి ఎవుసానికి మూడు గంటల కరెంటే చా ంటున్నడు. 10హెచ్‌పీ మోటర్లు పెడుతామంటున్నడు. గీపని అయ్యేదేనా. మంచిగున్న రైతులను ఆగం చేసేందుకే ఆయన ఇష్టమచ్చినట్టు మాట్లాడవట్టే. మూడు గంటల కరెంటుతో ఒక మడన్న పారుతదా. కాంగ్రెస్ పాలనల నీళ్లు, కరెంటు లేక భూములు అమ్ముకొని చానా మంది వలసకు పోయిన్రు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు 24గంటల కరెంటు ఇయ్యవట్టే. పుష్కలంగా నీళ్లు రావట్టే. గిప్పుడు చానా మంది ఊళ్లలో ఎవుసం చేస్తున్నరు. సంతోషంగా ఉన్నరు. ఇంకా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నడట. అది ఖర్చుతో కూడుకున్న పని. రైతులతోటి కాదు. ఆ మోటర్లు పెట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు ఆగుతయా.? ఎక్కడికక్కడ కాలిపోతయి. రైతుల జీవితాలతో కాంగ్రెస్ ఆడుకోవాలని చూస్తుంది. మా తెరువు వస్తే మంచిగుండది జాగ్రత్త.

**- ఏనుగు మల్లారెడ్డి, రైతు, రాయికల్.**

### ❖ ఆ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదు



కాంగ్రెస్ పాలనలో ఎవుసం చాలా కష్టంగా ఉండేది. మా నాన్న చాలా ఇబ్బందులు పడ్డడు. వచ్చీరాని కరెంట్ కోసం రాత్రి పూట మా నాన్న పొలానికి పోతుంటే ఇంటికి వచ్చేదాక మాకు భయంగా ఉండేది. ఎవుసంతో బతుకులేదని అన్నడు. నేను దుబాయ్‌కి పోయిన. నాలుగేండ్ల క్రితం తిరిగివచ్చిన. ఇక్కడి భూములు, పొలాలు చూస్తుంటే చానా సంబురమైతంది. కేసీఆర్ సారు ఎవుసానికి 24 గంటల కరెంట్, పుష్కలంగా నీళ్లు ఇస్తుండబట్టే పంటలు బాగా పండుతున్నయని మావోళ్లు అంటే సంబురమైంది. ఇక్కన్నే ఉన్న. మళ్లీ పోలే. మాకు ఉన్న ఒక ఎకరం పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న. రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్న. ఇప్పుడు కాంగ్రెస్సోడు 24 గంటల కరెంట్ వద్దంటున్నడట. వాడెవరు వద్దనేందుకు..? మూడు గంటలే ఇస్తం. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నరట. వాళ్లదేం నడువది. ఆ పార్టీ వచ్చేది లేదు. సచ్చేది లేదు. మాకు కేసీఆరే ఉండాలి. ఈ కరెంటే కావాలి.

**- పాలెపు వంశి, రైతు, జగిత్యాల మండలం చల్‌గల్**

### ❖ కోలుకోని దెబ్బ కొడుతం..



పట్నంల భూములమ్ముకుంట. అమాయకులను బెదిరించుకుంట పైసలు దొబ్బే రేవంత్‌రెడ్డికి ఎవుసం గురించి ఎం తెలుసు..ఎన్నడన్నా నాగలి పట్టిండా. పొలందున్నిండా.. ఇప్పుడు ఎన్నికలు రాంగనే నోటికచ్చినట్లు అరుస్తున్నడు. రైతుల పక్షపాతి అయినా కేసీఆర్‌ను ఇష్టమొచ్చినట్లు తిడుతున్నడు. ఆయన ఇత్తానన్న మూడు గంటల కరెంట్‌తో ఒక్క దొయ్య కూడా పారదు. 10 హెచ్‌పీ మోటర్ పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్. మోటర్లు గూడా కాలిపోతయ్. ఇదంతా ఆయనకేం ఎరుకా..రైతులు ఓట్లతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరు. కచ్చితంగా చెబుతం. ఆ పార్టీకి కోలుకోని దెబ్బతగులుతది.

**- బొల్లపు హన్మంతు, రైతు, లక్ష్మీదేవిపల్లి(సారంగాపూర్)**